

అన్నకు ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు

స్మరించుకున్న అభిమానులు, శ్రేణులు



పూలమాలలతో నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని అన్నదానం, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ కార్యాలయాలు, ఎన్టీఆర్ కూడళ్లకు కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున తరలివచ్చారు. పార్టీ ఆవిర్భావం, ఎన్టీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలు, ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ముందుకు సాగుదామని నాయకులు పిలుపునిచ్చారు.

తెలుగుజాతి కీర్తి పతాక: పరిటాల సునీత



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ నాయకులు

తెలుగుజాతి కీర్తి పతాక ఎన్టీఆర్ అని, తెలుగు ప్రజలు ఉన్నంతవరకు ఎన్టీఆర్ పేరు ఉంటుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరిలోని పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర చిత్రపటాలకు ఆమె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ ఆహ్వానంతోనే పరిటాల రవీంద్ర రాజకీయాల్లోకి వచ్చారని అన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు వల్లే తాము రాజకీయాల్లో ఉన్నామని అన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎన్టీఆర్ విగ్రహాలను వచ్చే వర్ధంతిలోగా ఏర్పాటు చేయిస్తామని అన్నారు. రామగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రామ్మూర్తినాయుడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, మాజీ ఎంపీపీ పరంధామ యాదవ్ పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, రామగిరి

ఆదర్శమూర్తి: దగ్గుపాటి



దగ్గుపాటి, వెంకటశివుడు యాదవ్, పూల నాగరాజు తదితరుల నివాళి

ఎన్టీఆర్ ఆదర్శమూర్తి అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. పార్టీ అర్బన్ కార్యాలయం, ఆర్ట్స్ కళాశాల, జడ్పీ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహాలకు ఆయన పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ పేరే ఒక సంచలనమని, ఆయన పేరు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని అన్నారు. ఆదర్శ నగర్ గుడిసెల్లో పేదలకు దోమ తెరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు అన్నదానం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, మాజీ మేయర్ స్వరూప, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం అర్బన్

తెలుగుజాతి గుండెల్లో ఎన్టీఆర్: కాలవ

తెలుగుజాతి గుండెల్లో ఎన్టీఆర్ కొలువై ఉన్నారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. రాయదుర్గంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీతారామాంజనేయ కళ్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన 730 మందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. మహిళలకు ఆస్తి హక్కు, రూ.2కు కిలో బియ్యం లాంటి ఎన్నో పథకాలతో ఎన్టీఆర్ పేదలకు అండగా నిలిచారని కొనియాడారు. సీఎం చంద్రబాబు ఎన్టీఆర్ ఆశయాలను మరింత ముందుకు తీసుకెళుతున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, కన్వీనర్లు బలరాంరెడ్డి, హనుమంతరెడ్డి, లాలెప్ప, గిరిమల్లప్ప, హనుమంతు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, రాయదుర్గం



ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

చిరస్మరణీయుడు: గుమ్మనూరు



నివాళులు అర్పిస్తున్న గుమ్మనూరు జయరాం

తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్ చిరస్మరణీలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. గుంతకల్లులో ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్ అని, పేదలకు కూడు, గూడు, గుడ్డ అందించడంతో పాటు సామాజిక న్యాయం చేశారని అన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, పత్తి హిమబిందు, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, జనసేన నాయకులు వాసిగిరి మణికంఠ, గాజుల రఘు, బీజేపీ నాయకులు రామాంజినేయులు, విజయలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, గుంతకల్లు టౌన్

యుగపురుషుడు: అశ్మిత్



ఎమ్మెల్యే అశ్మిత్ రెడ్డి నివాళి

ఎన్టీఆర్ యుగపురుషుడని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి అన్నారు. తాడిపత్రి ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి, పాలనలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ, నాయకులు ప్రభాకర్ నాయుడు, కూరపాటి నరేంద్రనాయుడు, చింబిలి ప్రసాద్‌నాయుడు, చల్లా సూరి, రాంబాబు, వెంకటనాయుడు, రాము, వీరనారాయణ, రమణ, చంద్రశేఖర్, ఓబిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, తాడిపత్రి

స్ఫూర్తి ప్రదాత: అమిలినేని



ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నివాళి

తెలుగు ప్రజలకు ఎన్టీఆర్ స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. పేదల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో సీఎం చంద్రబాబు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. వైసీపీ పాలకులు ఐదేళ్లలో విశాఖ ఉక్కు పరిశ్రమను నిర్వీర్యం చేశారని, సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి రూ.11,400 కోట్లు తెచ్చారని అన్నారు. ఆర్డీటీ, ప్రభుత్వ ఆస్పత్రులలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

- ఆంధ్రజ్యోతి, కళ్యాణదుర్గం

ఉమ్మడి రాష్ట్రానికి వన్నెతెచ్చారు: శ్రావణి

ఉమ్మడి రాష్ట్రానికి ఎన్టీఆర్ వన్నె తెచ్చారని, ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చారని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అన్నారు. శింగనమలలో ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు ఆమె పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ స్థాపించారని అన్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పార్టీ సీనియర్ నాయకుడు యాటా వెంకట సుబ్బన్న వృద్ధులు, చిన్నారులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, మారుతి నాయుడు, ఆలం వెంకటనరసాయుడు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, శింగనమల



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రావణి

నిను మరువ తరమా..!

నాడు



గత ఏడాది.. స్నాతకోత్సవాల సమయంలో..

నేడు



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు

అనంతపురం సెంట్రల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వెలిసిపోయిన అన్న ఎన్టీఆర్ విగ్రహం కూటమి పార్టీల ఏలుబడిలో మెరుపును సంతరించుకుంది. దివంగత ఎన్టీఆర్ తెలుగు ప్రజల సొత్తు అన్న విషయాన్ని గత పాలకులు విస్మరించారేమో..! అన్న విగ్రహాన్ని పట్టించుకోలేదు. దీంతో విగ్రహం రంగు వెలిసిపోగా కొన్ని చోట్ల పెచ్చులూడే పరిస్థితి కనిపించింది. స్నాతకోత్సవానికి ఆడిటోరియాన్ని లక్షలు వెచ్చించి అందంగా అలంకరించిన పాలకులు.. ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని మాత్రం మరిపోయేవారు. దీనిపై పలువురు విమర్శించినా నాటి పాలకులు ఏమాత్రం ఖాతరు చేయలేదు. ఎన్టీఆర్ రాష్ట్రానికి చేసిన సేవలకు గుర్తుగా నగరంలోని జేఎన్టీయూలో గత టీడీపీ ప్రభుత్వం 'నందమూరి తారకరామారావు కళాక్షేత్రం' పేరుతో అధునాతన సౌకర్యాలతో కూడిన ఆడిటోరియంను నిర్మించింది. ఆడిటోరియం ఎదుట ఎన్టీఆర్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ ఆడిటోరియంలోనే వర్సిటీ స్నాతకోత్సవాలు, ఇతర వేడుకలు నిర్వహిస్తున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో వర్సిటీ పాలకులు పక్కా రాజకీయ నాయకులుగా మారిపోయారు. దీంతో ఎన్టీఆర్‌ను సైతం ప్రతిపక్ష రాజకీయ నాయకుడిగా భావించిన అప్పటి యాజమాన్యం ఆయన పేరును తొలగించి, విగ్రహాన్ని విస్మరించింది. వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన క్రమంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహాన్ని అలంకరించి, అధికారులు ఘనంగా నివాళులర్పించారు.

పెన్నా నది పరిశీలన

ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసిన అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పామిడి సమీపంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను మైన్స్, రెవెన్యూ, పోలీసు అధికారులు శనివారం సీజ్ చేశారు. 'చీకటి తోడేళ్లు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆరా తీశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, పామిడి తహసీల్దారు శ్రీధర్‌మూర్తి, ఎస్ఐ రవిప్రకాష్ పెన్నానదిలో ఇసుక తవ్వకాలను పరిశీలించారు. రాత్రి పూట నదిలోకి వాహనాలకు అనుమతి లేదని, ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక అవసరమైనవారు కూలీలు, ట్రాక్టర్‌తో రావాలని సూచించారు. యంత్రాలతో, టిప్పర్లలో ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లోతుగా గుంతలు తవ్వరాదని అన్నారు. నదిలో ఇసుక తవ్వకాలపై కలెక్టర్‌కు నివేదిస్తామని, కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అన్నారు. యజమాని లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పామిడి వద్ద పెన్నానదిలో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



మాట్లాడుతున్న డీసీ నాగ మద్దయ్య

అనంతపురం అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ మద్యం సరఫరా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. నగరంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్ రామమోహన్ రెడ్డి, ఏఈఎస్ శ్రీరామ్‌తో కలిసి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లతో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోకి కర్ణాటక, గోవా తదితర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం సరఫరా కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమ మద్యం సరఫరా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కల్లు దుకాణాల్లో కల్తీ కల్లు విక్రయాలు జరగకుండా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు. కల్లు దుకాణాల్లో నమూనాలు సేకరించి, పరీక్షలకు పంపాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నవోదయం 2.0 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. నాటు సారాను, బెల్టుషాపులను పూర్తిగా అరికట్టాలని సూచించారు.

బాధ్యతలు చేపట్టిన ఏఎస్పీ



ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రోహిత్ కుమార్‌చౌదరి

తాడిపత్రి/అనంతపురం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి సబ్ డివిజన్ ఏఎస్పీగా రోహిత్ కుమార్ చౌదరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ రామకృష్ణుడు మంగళగిరి హెడ్‌క్వార్టర్‌లో రిపోర్ట్ చేసుకునేందుకు వెళ్లారు. రోహిత్ కుమార్ చౌదరి 2022 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. రాష్ట్ర గ్రేహౌండ్స్ విభాగంలో అసాల్ట్ కమాండర్‌గా పనిచేశారు. ఏఎస్పీని సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీని సత్కరించి వీడ్కోలు పలికారు. బాధ్యతలు చేపట్టిన ఏఎస్పీ అనంతరం జిల్లా కేంద్రానికి వెళ్లి ఎస్పీ జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

విచారించి.. నివేదిక ఇవ్వండి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'బంగారు బుల్లోడు'పై ఆర్జేడీ, కలెక్టర్ సీరియస్

అనంతపురం విద్య, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బంగారు బుల్లోడి వ్యవహారంపై విద్యాశాఖ, జిల్లా అధికారులు విచారణకు దిగారు. ప్రైవేటు విద్యాసంస్థల నుంచి వసూళ్లు చేయడం, ప్రభుత్వ ఉపాధ్యాయులతో దురుసుగా వ్యవహరించడం గురించి ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు వచ్చాయి. దీంతో కడప ఆర్‌జేడీ, కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఆ అధికారిపై అనేక విమర్శలు, ఆరోపణలు వస్తున్నా విద్యాశాఖ అధికారులు వెనకేసుకొస్తూ వచ్చారు. ఈ విషయం కమిషనర్ దృష్టికి కూడా వెళ్లినట్లు సమాచారం. కమిషనర్ నుంచి ఒత్తిడి రావడంతో అధికారులు చర్యలకు దిగారు. కడప ఆర్‌జేడీ శామ్యూల్ శుక్రవారం బాధ్యతలు తీసుకోగానే.. 'బంగారు బుల్లోడు'పై నివేదిక ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించినట్లు తెలిసింది. ఆ అధికారిపై ఆర్‌జేడీ తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆర్‌జేడీ ఆదేశాలతో ఆయనపై అక్రమాలపై విచారణకు డీఈఓ ప్రసాద్‌బాబు సిద్ధమయ్యారు. కలెక్టర్ సైతం నివేదిక ఇవ్వాలని సమగ్రశిక్ష ప్రాజెక్టు ఏపీసీని ఆదేశించారు. ఉత్తర్వుల కాపీ శనివారం సమగ్రశిక్ష ప్రాజెక్టు చేరింది. ఇప్పటికే ఆ అధికారి అక్రమాల చిట్టా విద్యాశాఖ కమిషనరేట్‌కు చేరింది. దీనికితోడు విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారుల విచారణ జరగనుంది. త్వరలో ఆ అధికారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి.



స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్న కలెక్టర్

స్వచ్ఛంగా తీర్చిదిద్దుదాం: కలెక్టర్

అనంతపురం టౌన్/ఉరవకొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రజలందరి భాగస్వామ్యంతో జిల్లాను స్వచ్ఛంగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ఉరవకొండలో శనివారం నిర్వహించిన 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'లో అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో రూ.76 లక్షలతో నిర్మించిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ ట్యాంకులను ప్రారంభించారు. పరిశుభ్రత ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించారు.

కలెక్టరేట్‌ను మోడల్‌గా నిలుపుదాం: జేసీ

పరిశుభ్రతలో కలెక్టరేట్‌ను మోడల్‌గా నిలుపుదామని జేసీ శివనారాయణ శర్మ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వచ్ఛ దివస్‌లో ఆయన పాల్గొన్నారు. డీఆర్వో మలోల, విభాగాల అధికారులు, ఉద్యోగులతో కలిసి చెత్తను తొలగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. కలెక్టరేట్‌ను పరిశుభ్రంగా మార్చి, జిల్లాకు సందేశం ఇద్దామని అన్నారు. డీపీఎం ఆనంద్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌లు యుగేశ్వరి, వసంత లత, రియాజుద్దీన్, ఏఓ అలెగ్జాండర్ పాల్గొన్నారు.

ఆటా.. పాటా.. మాదే..!


స్కూలుకు సెలవు.. అంటే పిల్లలకు పండగే..! ఇంటి వద్ద, వీధుల్లోనూ పగలంతా ఆడిపాడుతుంటారు. మరి సంక్రాంతి సందర్భంగా పదిరోజులు సెలవులు ఇస్తే...! వారి సంబరానికి ఆకాశమే హద్దు. రోజుకొక ఆట, పాటతో మైమరచిపోతారు. రోజులు గంటలు, నిమిషాల్లా వేగంగా గడిచిపోతాయి. అలా ఇప్పటికే పండుగకు ఇచ్చిన సెలవులు తొమ్మిది రోజులు గడిచిపోయాయి. ఈక్రమంలో సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అందుకే ఉన్న ఒక్కరోజును కూడా వదలకుండా పిల్లలంతా కొందరు పెద్దలతో కలిసి సరదగా గడిపేస్తున్నారు. అనంతపురం, కూడేరు ప్రాంతాల్లో శనివారం పిల్లలు ఆడుకుంటుండగా 'ఆంధ్రజ్యోతి' తీసిన చిత్రాలు ఇవి.

ఈ ఆట మీకు తెలుసా..?



జల్లిపల్లిలో అచ్చన్నగాయలు ఆడుతున్న బాలికలు

మంచి ఫోజు ఇవ్వరా..!



రేయ్ మనల్నే ఫొటోలు తీస్తుండారు.. మంచి ఫోజు ఇయ్యల్ల..

లే.. కొడితే గుండు అవతల పడల్ల..!



కూడేరులో గోళీలాట ఆడుతున్న బాలలు

ఊగే ఊగే ఉయ్యాలా..



అనంతపురం హౌసింగ్‌బోర్డు పార్కులో పిల్లలు, పెద్దల సరదా

ఘుమ ఘుమలు..



ఉత్తుత్తి వంటలు.. భలే రుచిగా ఉంటాయి..

నా చేతిలో విష్ణు చక్రం



దారంతో ఆట వస్తువును తిప్పుతున్న బాలిక





రేకుల షెడ్డులో నిల్వ చేసిన గోవా మద్యం, ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి

పట్టుకోండి చూద్దాం..!

- గోవా లిక్కర్ కేసులో ప్రధాన నిందితుడి సవాల్
- నెల రోజులుగా ఎక్సైజ్ పోలీసుల ముమ్మర గాలింపు
- కాసింత క్లూ దొరకనివ్వని 'బూసుపల్లి'

అనంతపురం అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): చేతనైతే పట్టుకోండి చూద్దాం ..! అంటూ గోవా మద్యం అక్రమ రవాణా, విక్రయం కేసుల్లో ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి జిల్లా ఎక్సైజ్ పోలీసులకు సవాల్ విసిరుతున్నాడు. గత కొన్ని రోజులుగా అతడి కోసం ఎక్సైజ్ పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నా దొరకడం లేదు. గతేడాది డిసెంబరు 9న రాప్తాడు రైల్వే గేటు సమీపంలోని ఓ తోటలో అక్రమంగా నిల్వ ఉంచిన 474 బాక్సుల గోవా మద్యాన్ని అనంతపురం ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు. దీని విలువను ఏపీ మద్యం ధరల ప్రకారం రూ.44 లక్షలుగా లెక్కగట్టారు. అప్పట్లో తొలి రోజు ఐదుగురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వీరందరికి ఎక్సైజ్ కోర్టు రిమాండ్ విధించింది. తాజాగా ఆ నిందితులకు బెయిల్ మంజూరైంది.

బూసుపల్లిని పట్టుకునేదెన్నడో..?

గోవా అక్రమ మద్యం కేసులో ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్ రెడ్డి పరారీలో ఉన్నాడు. అతడి కోసం నెల రోజులుగా ఎక్సైజ్ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. రెండు బృందాలుగా విడిపోయి నెల్లూరు, హైదరాబాద్, కర్ణాటక, అనంతపురం సమీప ప్రాంతాల్లో గాలించారు. అయితే ప్రధాన నిందితుడు సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేసుకోవడంతో సాంకేతికంగా అతడి ఆచూకీ కనుక్కోవడం పోలీసులకు కష్టమవుతోంది. తన స్థానంలో ఇతరులను నిందితుడిగా చిత్రీకరించేందుకు తొలి రోజుల్లో ప్రధాన నిందితుడు పలు రకాలుగా ప్రయత్నించినట్లు సమాచారం. తన స్థానంలో లొంగిపోయేందుకు కొందరితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. అయితే అప్పటికే ఎక్సైజ్ ఉన్నతాధికారులు ప్రధాన నిందితుడి ఫొటో సేకరించడం, మీడియాలో కూడా ఫొటోతో కథనం రావడంతో ఆ ప్రయత్నం బెడిసికొట్టినట్లు సమాచారం. ఇప్పటికే అరెస్టు చేసిన నిందితులతో ప్రధాన నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు విచారణ చేసినా ఎలాంటి ప్రయోజనం కనిపించలేదన్నట్లు తెలిసింది. అనంతపురంలో తన కుటుంబ సభ్యులు ఉంటున్న ఇంటిని ఖాళీ చేసి, మరో ప్రాంతానికి మకాం మార్చినట్లు తెలిసింది. అయితే పాత ఇంటి యజమానికి అద్దె డబ్బులను ఫోన్‌పే చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ సెల్ నెంబర్ గురించి ఆరా తీయ గా బయట సాధారణ వ్యక్తిదని తేలినట్లు సమాచారం. ప్రధాన నిందితుడిని పట్టుకోవడంలో సాంకేతికంగా సహకరించాలని జిల్లా ఎస్పీని ఎక్సైజ్ ఉన్నతాధికారులు కోరినట్లు సమాచారం. ఇతర నిందితులను పట్టుకోవడంలో సక్సెస్ అయిన ఎక్సైజ్ పోలీసులు నెల రోజులు దాటినా ప్రధాన నిందితుడిని అరెస్టు చేయలేకపోవడంతో వారి పనితీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన నిందితుడు మద్యం అక్రమ విక్రయాల్లో దిట్టగా పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలు మొదలు పెట్టినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదంటూ ఎక్సైజ్ శాఖలోని కొందరు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

డబ్బులు సమకూర్చే వ్యక్తి కోసం గాలింపు

గోవా అక్రమ మద్యం కేసులో మరో కోణంలో ఎక్సైజ్ పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ప్రధాన నిందితుడికి భారీగా అక్రమ మద్యం కొనుగోలు చేసేందుకు డబ్బులు సమకూర్చే ఫైనాన్షియర్‌ను ఎక్సైజ్ పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఆ వ్యక్తిని పట్టుకునే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. త్వరలోనే అతడిని అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. డబ్బులు సమకూర్చే వ్యక్తి దొరికితే గోవా అక్రమ మద్యం కేసులో మరిన్ని విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉన్నట్లు ఆ శాఖలో చర్చ సాగుతోంది.

త్వరలో పట్టుకుంటాం



గోవా అక్రమ మద్యం కేసులో ప్రధాన నిందితుడిని పట్టుకునేందుకు ముమ్మర ంగా గాలిస్తున్నాం. ఈ కేసులో ఇప్పటికే 8 మందిని అరెస్టు చేశాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రధాన నిందితుడి కోసం ఇతర జిల్లాల్లోనూ గాలింపు చర్యలు చేపట్టాం. సాంకేతికను ఉపయోగించి ప్రధాన నిందితుడు దొరక్కుండా తప్పించుకుంటున్నాడు. పలు కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఎన్ని వేషాలు వేసినా త్వరలోనే ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డిని పట్టుకుంటాం.

\- నాగమద్దయ్య,
ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

ఎన్టీఆర్‌కు ఎంపీ అంబికా నివాళి

అనంతపురం అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దివంగత ఎన్టీఆర్‌కు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని కేరళ రాష్ట్రం కొచ్చిలోని ఓ హోటల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికాతోపాటు పార్లమెంట్ కమిటీ ఫర్ లేబర్ ఛైర్మన్ బసవరాజ్ బొమ్మై, ఎంపీ హరిష్ బాలయోగి, కమిటీ సభ్యులు పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు.



ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎంపీ అంబికా

తెలుగు వారి కీర్తి పతాక.. ఎన్టీఆర్: బీకే

పెనుకొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగువారి కీర్తి పతాకాన్ని ప్రపంచ వ్యాప్తంగా సగౌరవంగా నిలిపిన వ్యక్తి నందమూరి తారకరామారావు అని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి కొనియాడారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలకు అండగా నిలిచిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. పార్టీ ఆవిర్భావం తరువాత రూ.2 కిలో బియ్యం, చీర, ధోతి, అందించిన ఘనత రామారావుదేనన్నారు. నివాళులర్పించిన వారిలో జీవీపీ నాయుడు, కేశవయ్య, రొద్దం నరసింహులు, సుబ్బలక్ష్మమ్మ, దేవానరసింహప్ప, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.



నివాళులు అర్పిస్తున్న బీకే పార్థసారథి తదితరులు

భూములకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుపై అవగాహన సదస్సులో రైతులు

యాడికి, జనవరి18(ఆంధ్రజ్యోతి): కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు కోసం సేకరించనున్న భూమికి గిట్టుబాటు ధర ఇవ్వాలని అధికారులను పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి శనివారం కమలపాడు, చింతలాయపల్లి, కుందనకోట గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాజెక్టును 874.70 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో కొంత భాగం భూమిని రైతుల నుంచి సేకరించనున్నారు. అవగాహనా సదస్సులో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటుకు గ్రామస్థులు సహకారం అందించాలని కోరారు. ప్రాజెక్టు ఏర్పాటు వలన ఆయా గ్రామాల ప్రజలకు కలిగే లాభాల గురించి వివరించారు.



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

పలువురు రైతులు మాట్లాడుతూ గతంలో సిమెంట్ ఫ్యాక్టరీలకు భూములను ఇచ్చి తాము తీవ్రంగా నష్టపోయామన్నారు. భూములు కోల్పోయిన రైతుల పిల్లలకు కూడా ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు ఇవ్వకుంటే ప్రాజెక్టులు, ఫ్యాక్టరీల వల్ల తమకు ఏమి ఉపయోగం అని వారు అధికారులను ప్రశ్నించారు. భూములకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా ప్రాజెక్టుల ఏర్పాటు అంటూ, అభివృద్ధికి సహకరించాలంటూ రైతులను మభ్య పెట్టడం సరికాదని వారు తెలిపారు. కుందనకోట, చింతలాయపల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేయనున్న విద్యుత్ ప్రాజెక్టుకు కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుగా పేరు ఏర్పాటుచేయాలని ఆయా గ్రామాల రైతులు అధికారులకు విన్నవించారు. సమావేశంలో ఏపీ జెన్‌కో ప్రాజెక్టు డీఈ ఆంజనేయులు, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే నాగరాజు, ఎస్ఐ వెంకటరమణ, కమలపాడు సర్పంచు కంబగిరిస్వామి, ఆర్ఐ కిష్టప్ప, వీఆర్వోలు భీమేశ్వరరెడ్డి, గంగన్న, గ్రామసర్వేయర్ మౌలాలి పాల్గొన్నారు.

ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 21న రాచానపల్లి సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా స్థాయి జూనియర్ బాల, బాలికల విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. 2004 జనవరి 1 తరువాత జన్మించినవారు పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెలాఖరులో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొంటారన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9949279330, 9398969691లను సంప్రదించాలని కోరారు.

నేడు ఆర్డీటీ 10కే రన్, 5కే వాక్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆరు గంటలకు కలెక్టరేట్ వద్ద 10కె రన్, 5కె వాక్ ప్రారంభించనున్నట్లు ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటలకు ప్రారంభమై అనంత క్రీడాగ్రామంలో ముగిసే రన్, వాక్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఎస్పీ జగదీష్ హాజరవుతారన్నారు. వీరితోపాటు మున్సిపల్ కమిషనర్ వినూత్న, డీఎఫ్ఓ శ్రీనివాస రెడ్డి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్‌లతో పాటు అల్ట్రా మారథాన్ రన్నర్ జువాన్ మాన్యుయేల్‌లు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

తిరుగు ప్రయాణానికి 54 ప్రత్యేక బస్సులు

అనంతపురం కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సొంతూళ్లకు వెళ్లిన వారు యథాస్థానాలకు వస్తున్న నేపథ్యంలో 54 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పండుగ సందర్భంగా ఊళ్లకు వెళ్లిన వారంతా ఆదివారం నుంచే యథాస్థానాలకు రావడానికి ప్రయత్నిస్తారని, అందుకే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ, తిరుపతి తదితర నగరాల రూట్లకు 54 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే ఉంటాయని పేర్కొన్నారు. అనంతపురం నుంచి చెన్నైకు రాత్రి 9.30 గంటలకు, చెన్నై నుంచి అనంతపురానికి రాత్రి 9 గంటలకు, అనంతపురం నుంచి విజయవాడకు రాత్రి 8.30 గంటలకు, విజయవాడ నుంచి అనంతపురానికి రాత్రి 9 గంటలకు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు వివరించారు.

భూమిరాంగ్..!

- సాగులో ఉన్నా ఆన్‌లైన్‌లో తొలగింపు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- బ్యాంకర్ల ఒత్తిడితో విలవిల



రత్నమ్మ సాగు చేసిన వేరుశనగ పంట పొలం

కూడేరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్‌లో నుంచి తొలగించడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ సానుభూతిపరుల భూములను వైసీపీ పాలనలో ఆన్‌లైన్ నుంచి తొలగించారు. దీంతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకర్ల ఒత్తిడి ఎక్కువైందని, అధికారులు విచారణ చేసి తమ భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని ఎన్ని పోరాటాలు చేసిన రైతులకు నిరాశే మిగులుతోంది. ఇదంతా మండలంలోని ఉదిరిపికొండ గ్రామ రైతుల వ్యథ. ఉదిరిపికొండ గ్రామమే కాదు మండలంలోని చాలా రెవెన్యూ గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది. 2020 సంవత్సరంలో మండల వ్యాప్తంగా దాదాపు 13 వందల మంది రైతులు భూములను రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేయకుండా ఏకపక్షంగా భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో అన్నదాతలు భగ్గుమన్నారు. తాము సాగు చేస్తున్న భూములను ఎలా తొలగించారని అధికారులను ప్రశ్నించారు. అయితే ఇవన్నీ ట్రైనీ కలెక్టర్ తొలగించారని, అప్పటి రెవెన్యూ అధికారులు చెప్పి తప్పించుకున్నారు. అప్పటి నుంచి అన్నదాతలు తమ భూములను ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలని ఎన్ని అర్జీలు ఇచ్చినా ఫలితం దక్కలేదు.

అర్హులకు న్యాయం చేస్తాం



రెవెన్యూ సదస్సుల్లో రైతులు అందించిన అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. భూములు సాగు చేస్తూ ఆన్‌లైన్‌లో లేకపోతే అలాంటి రైతులను గుర్తించి, ని వేదికలు తయారు చేసి అసైన్మెంట్ కమిటీలో న్యాయం చేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు వచ్చిన అర్జీలకు పరిష్కారం చూ పి, అర్హులకు న్యాయం చేస్తాం.

\- మహబూబ్‌బాషా,
ఇన్‌చార్జ్ తహసీల్దారు,
కూడేరు

కూటమి ప్రభుత్వంపై ఆశ

రాష్ట్రంలో వైసీపీ పాలనలో భూముల సమస్యలతో అన్నదాతలు సతమతమవుతున్నట్లు గుర్తించిన కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించింది. సమస్యలను అర్జీల రూపంలో రైతుల నుంచి తెలుసుకుని పరిష్కారం దిశగా అడుగులు వేస్తుండటంతో అన్నదాతలకు ఆశలు చిగురించాయి. మండలంలో 13 రెవెన్యూ గ్రామాల నుంచి వివిధ సమస్యలతో అన్నదాతలు 500 వినతులు అందించారు. అత్యధికంగా ఉదిరిపికొండ రెవెన్యూ గ్రామంలోనే 123 అర్జీలు వచ్చాయి. ఆ గ్రామంతోపాటు ఇప్పేరు 91, కల్లగళ్ల 66, తిమ్మాపురం 45, కూడేరు 43, చోళసముద్రం 23, మరుట్ల 21, గొట్కూరు 21, కమ్మూరు 16, కొర్రకోడు 15, జయపురం 14, బ్రహ్మణపల్లి 12, ఎంఎంహళ్లి 10 అర్జీలు అధికారులకు అందించారు. ఎక్కువగా సాగు చేసిన భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని, రస్తా వివాదాలకు సంబంధించిన అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



ఆన్‌లైన్ నుంచి తొలగించిన రైతు ఎరికిల పుల్లప్ప చీనీ తోట

న్యాయం చేయాలి



నా భార్య నా భార్య షమీనాబాను పేరిట కాంగ్రెస్ పాలనలో భూ పంపిణీ కింద రెండు ఎకరాలకు పట్టాతోపాటు పాసుపుస్తకాలు అందించారు. మరో రెండు ఎకరాలు సాగు చేసుకుంటూ ఆన్‌లైన్‌లో నాలుగు ఎకరాలు నా భార్య పేరు మీద ఉండేది. అందులో వివిధ రకాల పంటలను సాగు చేస్తూ, జల్లిపల్లి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో రుణం తీసుకున్నాం. వైసీపీ అధికారంలోకి రాగానే మా భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఎంత మంది అధికారుల వద్ద మొర పెట్టుకున్న ఫలితం దక్కలేదు. కూటమి ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి.

\- షేక్షావలి, రైతు, ఉదిరిపికొండ

బయట అప్పు చేసి బ్యాంకు రుణం తీర్చాం



నా పేరున ఉన్న నాలుగు ఎకరాల భూమిలో చీనీ పంట సాగు చేస్తున్న. 2015 సంవత్సరంలో నా పేరు మీద భూమిని ఆన్‌లైన్‌లోకి ఎక్కించారు. వైసీపీ పాలనలో తొలగించారు. భూమిలో బోరు వేయగా పుష్కలంగా నీరు పడటంతో చీనీ పంట సాగు చేస్తున్నా. భూమిపై బ్యాంకులో అప్పుతీసుకున్నాం. ఆన్‌లైన్ నుంచి భూమిని తొలగించడంతో బ్యాంకర్లు ఒత్తిడి పెట్టారు. దీతో బయట అప్పు చేసి బ్యాంకు రుణం చెల్లించా. సాగులో ఉన్న మా భూములను ఎలా తొలగించారని రెవెన్యూ సదస్సులో అధికారులను ప్రశ్నిస్తే, విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు

\- ప్రభాకర్, రైతు, ఉదిరిపికొండ

ప్రైవేటు వాహనాల బాదుడు



సంక్రాంతి వంకతో రెట్టింపు వసూళ్లు
నిబంధనల ఉల్లంఘన
పట్టించుకోని అధికారులు

కదిరి అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ కోసం ఎక్కడికెక్కడి నుంచో సొంతూళ్లకు వచ్చిన వారు తిరుగు ప్రయాణమవుతున్నారు. సెలవులు ముగియడంతో బస్సులు, రైళ్లు రద్దీగా కనిపిస్తున్నాయి. డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ప్రైవేటు వాహనాల యజమానులు ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగుళూరుకు వెనుదిరుగుతున్నారు. టిక్కెట్ ధరపై 50 నుంచి 70శాతం పైగా వసూలు చేస్తున్నారు. వారు ఎంత అడిగితే అంత సమర్పించుకుంటున్నారు. కదిరి నుంచి విజయవాడకు సాధారణ టిక్కెట్ రూ.840కాగా, ప్రస్తుతం రూ.1200 నుంచి రూ.1300 వసూలు చేస్తున్నారు. కదిరి నుంచి బెంగుళూరుకు ఆర్టీసీలో ఎక్స్‌ప్రెస్‌కు రూ.245, సూపర్‌లగ్జరీ రూ.360 కాగా, ప్రైవేటు వాహనంలో రూ. 350 నుంచి రూ.400 వసూలు చేస్తున్నారు. చెన్నైకి ఆర్టీసీలో రూ.620కాగా, ప్రైవేటు వాహనదారులు రూ.700 నుంచి రూ.1800 వరకు, హైదరాబాద్‌కు ఆర్టీసీలో రూ.830కాగా, ప్రైవేటు వాహనదారులు రూ. 1400 నుంచి రూ.1600 వరకు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు వాహనదారులు నిబంధనలు తుంగలో తొక్కుతున్నా రవాణా అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి.

ప్రత్యేక బృందాలతో తనిఖీలు : శ్రీనివాసులు, ఆర్టీఓ, కదిరి

ప్రైవేటు వాహనదారులు నిబంధనల ఉల్లంఘనపై తనిఖీలు చేపట్టాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తున్నాం. ప్రైవేటు బస్సుల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలి. ఎక్కువ చార్జీలు వసూలు చేయకూడదు. అలాంటి వారిపై నిబంధనల మేరకు కేసులు నమోదుచేస్తాం.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో గొడవ

అనంతపురం క్రైం, జనవరి18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాంనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నాసిర్ అహ్మద్ అనే వ్యక్తి శనివారం ఫొటోలు తీయడంతో గొడవ జరిగింది. దీంతో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ప్రైవేట్ వ్యక్తులను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొనసాగిస్తున్నారని గతంలోనే నాసిర్ అహ్మద్ అనే వ్యక్తి జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఇదే విషయంగా కొన్ని రోజులుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫొటోలు, వీడియాలు తీసేవాడని అధికారులు, సిబ్బంది పేర్కొన్నారు. నాసిర్ శనివారం మరోసారి రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ ప్రైవేట్ ఉద్యోగులు ఉంటుండటంతో ఫొటోలు తీశాడు. దీనిపై అక్కడే ఉన్న కార్పొరేటర్ భర్త రాయల్ మధు జోక్యం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ పంచాయితీ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరింది. విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని సబ్‌రిజిస్ట్రార్ యూనస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై చేయి చేసుకున్నట్లు నాసిర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా నాసిర్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నట్లు ఎస్ఐ రాంప్రసాద్ తెలిపారు.

చిన్నారితో కలిసి తల్లి అదృశ్యం...

అనంతపురం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని సత్యదేవ్ నగర్‌కు చెందిన కటిక అఖిల తన మూడేళ్ల కుమారుడు షాకీర్‌తో కలిసి కనిపించకుండా పోయింది. సత్యదేవ్‌నగర్‌లో దూదేకుల షెక్షావలి, కటిక అఖిల దంపతులు నివాసముంటున్నారు. ఈనెల 13న ఉదయం అఖిల ఇంట్లో ఎవరికీ చెప్పకుండా తన కుమారుడిని తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువుల కుటుంబాల్లో ఆరా తీసిన కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



◄ కుమారుడితో అఖిల(ఫైల్)

కార్పొరేషన్లకు.. పూర్వ వైభవం..!

బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు



బీసీ కార్పొరేషన్ కార్యాలయం

- స్వయం ఉపాధి... మెడికల్ షాపులకు రుణాలు విడుదల
- ఆదరణ పథకంపై కసరత్తు
- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు త్వరలోనే శుభవార్త

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్లకు కూటమి ప్రభుత్వం పూర్వవైభవం తీసుకొస్తోంది. సార్వత్రిక ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాటలను నిలబెట్టుకుంటోంది. ఇచ్చిన మాట ప్రకారం కార్పొరేషన్లకు జీవం పోస్తోంది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లను భ్రష్టు పట్టించింది. ఒక్కటంటే ఒక్క రుణం ఇవ్వకపోగా... ఆ కార్పొరేషన్లను నవరత్నాల దరఖాస్తుల పరిశీలనకు ఉపయోగించుకొని నిర్వీర్యం చేసింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆయా కార్పొరేషన్లకు గతంలో మాదిరే సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే ఇప్పటికే అన్ని కార్పొరేషన్ల అధికారులతో సమావేశాలు నిర్వహించి రుణాలు అందించేందుకు కసరత్తుల చేసింది. మొదటగా బీసీ కార్పొరేషన్‌కు స్వయం ఉపాధి రుణాలు, మెడికల్ షాపుల నిర్వహణకు రుణాలు ఇస్తూ బడ్జెట్‌ను కేటాయించింది. అదే విధంగా గతంలో అమలైన ఆదరణ పథకాన్ని సైతం పునరుద్దరించేందుకు అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. మరోవైపు ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అధికారులతో సైతం చర్చలు జరిపి రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ ఏడాది నుంచే రుణాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెబ్‌సైట్లను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేటగిరీల వారీగా రుణాలిలా...

బీసీ కేటగిరిలోని కులాల ఆధారంగా లోన్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిషిషరీ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్ స్కీమ్ కింద స్వయం ఉపాధి రుణాల కింద 1,953 యూనిట్లను విడుదల చేసింది. ఈ యూనిట్లకు మొత్తం రూ. 36.80 కోట్ల నిధులను విడుదల చేసింది. ఇందులో 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకు చెల్లించే విధంగా ప్రణాళికలు రూపొందించింది. ఇందులో కోసం రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకూ యూనిట్లను నిర్ణయించారు. కేటగిరీల వారీగా పరిశీలిస్తే... బీసీ కార్పొరేషన్ పరిధిలో ఈ ఏడాదికి 1,728 యూనిట్లకు గానూ రూ. 32.90 కోట్లు కేటాయించగా... రూ. 16.45 కోట్లు సబ్సిడీ... రూ. 16.45 కోట్లు బ్యాంకు లోను కింద జమ చేయాల్సి ఉంటుంది. ఈబీసీ కార్పొరేషన్‌కు 102 యూనిట్లకుగానూ 1.77 కోట్లు మంజూరు కాగా... 88.50 లక్షలు సబ్సిడీ, 88.50 లక్షలు బ్యాంకు లోను, కమ్మ కార్పొరేషన్‌కు 58 యూనిట్లకుగానూ రూ. 1.01 కోట్లు మంజూరు కాగా... 50.50 లక్షలు సబ్సిడీ... 50.50 లక్షలు బ్యాంకు లోను, రెడ్డి కార్పొరేషన్‌కు 29 యూనిట్లకుగానూ రూ. 50 లక్షలు మంజూరు చేయగా... రూ. 25 లక్షలు సబ్సిడీ, రూ. 25 లక్షలు బ్యాంకు లోను, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు 21 యూనిట్లకు రూ. 36 లక్షలు విడుదల కాగా... రూ. 18 లక్షలు సబ్సిడీ, రూ. 18 లక్షలు బ్యాంకు లోను, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 14 యూనిట్లకు రూ. 24 లక్షలు మంజూరు కాగా... రూ. 12 లక్షలు సబ్సిడీ, రూ. 12 లక్షలు బ్యాంకు లోను, క్షత్రియ కార్పొరేషన్‌కు ఒక యూనిట్‌కుగానూ రూ. 2 లక్షలు నిధులు విడుదల చేశారు.

జనరిక్ మెడికల్ షాపులకు రుణాలు...

జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటు చేసుకునే నిరుద్యోగ యువత కోసం రూ. 8 లక్షలు రుణాలు అందించనున్నారు. వీరికి 50 శాతం లబ్ధిదారుడి వాటా కింద... 50 శాతం బ్యాంకుకు చెల్లించాల్సి ఉంటుంది. మొత్తం జిల్లా వ్యాప్తంగా 72 యూనిట్లకు గానూ రూ. 5.76 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇందులో బీసీ కార్పొరేషన్ పరిధిలో 35 యూనిట్లకు రూ. 2.80 కోట్లు, ఈబీసీ కార్పొరేషన్‌కు 17 యూనిట్లకు గానూ రూ. 1.36 కోట్లు, కమ్మ కార్పొరేషన్‌కు 9 యూనిట్లకుగానూ రూ. 72 లక్షలు, రెడ్డి కార్పొరేషన్‌కు 5 యూనిట్లకుగానూ రూ. 40 లక్షలు, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్‌లకు 6 యూనిట్లకుగానూ రూ. 48 లక్షలు నిధులు విడుదల చేశారు. జిల్లాలో బీఫార్మసీ, డిఫార్మసీ చేసిన నిరుద్యోగ యువతకు మాత్రమే ఈ అవకాశం కల్పించారు.

అర్హతలివే....

స్వయం ఉపాధి కోసం దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అదే విధంగా జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకునే వారు బిఫార్మసీ, డి ఫార్మసీ సర్టిఫికెట్లతో పాటు ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు సిద్ధం చేసుకోవాలన్నారు. అదే విధంగా రుణాలకు దరఖాస్తులు చేసుకునే వారి వయస్సు 21 నుంచి 60 సంవత్సరాలలోపు ఉండాలన్నారు.



సంతోషంగా ఉంది

ఐదేళ్లుగా బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు లేక ఇబ్బందులు పడ్డాను. అయితే ప్రస్తుత ప్రభుత్వం రుణాలు తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉంది. రూ. లక్ష నుంచి రూ. 5 లక్షలు సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ కింద విడుదల చేయడం ఎంతో ఉపయోకరంగా ఉంది. ఇంకా వెబ్‌సైట్ అందుబాటులోకి రాలేదని అధికారులు అంటున్నారు. వచ్చిన వెంటనే ఓ మూడు లక్షల రుణానికి సంబంధించి దరఖాస్తు చేసుకుంటాను. రుణం మంజూరైతే చిన్నపాటి బిజినెస్ చేసుకుంటాను.

- మనోజ్, నిరుద్యోగి

త్వరలోనే అందుబాటులోకి..

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన స్వయం ఉపాధి, జనరిక్ మెడికల్ షాపుల రుణాలకు సంబంధించి అర్హులైన వారు సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలి. అయితే ప్రభుత్వం రూపొందించిన https://apobmms.apcfss.in వెబ్‌సైట్ త్వరలోనే అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే ఈ వెబ్‌సైట్ గురించి రాష్ట్రస్థాయి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

- సుబ్రహ్మణ్యం, ఈడీ, బీసీ కార్పొరేషన్

జాతీయ క్రికెట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



పూర్ణచంద్రిక



చైత్ర



లక్ష్య మోహన్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్-17 జాతీయ క్రికెట్ పోటీలకు జిల్లా క్రీడాకారిణులు ఎంపికయ్యారు. 2024-25 ఎస్‌జీఎఫ్-17 సీజన్ క్రికెట్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన పూర్ణచంద్రిక, చైత్ర, లక్ష్యమోహన్ జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారిణులు ఫిబ్రవరి 3 నుంచి హరియాణాలో నిర్వహించే ఎస్‌జీఎఫ్-17 బాలికల క్రికెట్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటారని అధికారులు తెలిపారు. వీరు ఈనెల 27న గుంటూరులో జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శులు సుగుణమ్మ, మొరార్జీయాదవ్ తెలిపారు.

రేపటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

అనంతపురం అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈనెల 20 నుంచి నెలాఖరుదాకా పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్దేశించిన షెడ్యూల్ మేరకు ఎంపిక చేసిన ప్రాంతాల్లో పశుఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించి, ఉత్పాదకత పెంచడం, వ్యాధులను నియంత్రించడమే పశు ఆరోగ్య శిబిరాల ప్రధాన ఉద్దేశ్యమన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. యువకుడి మృతి

తాడిపత్రి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని నంద్యాలరోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని బాలచంద్ర (26) మృతి చెందినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. సీపీఐ కాలనీకి చెందిన బాలచంద్ర రజకవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు ఆయన తెలిపాడు. బాలచంద్ర నంద్యాలరోడ్డులోని ఒక ఫంక్షన్‌హాలులో జరిగిన కార్యక్రమానికి వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య భారతి, నాలుగేళ్ల కుమారుడు విక్రమాదిత్ ఉన్నారని ఆయన తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సైబర్ మోసగాడి అరెస్ట్



సాకే శివయ్య

అనంతపురం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో అడ్మిట్ అయిన రోగి బంధువులకు ఆరోగ్య శ్రీ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేసే సైబర్ మోసగాడిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపిన మేరకు... శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం దుబ్బర్లపల్లికి చెందిన సాకే శివయ్య బీఈడీ వరకు చదివాడు. అతను బెట్టింగ్, జల్సాలకు అలవాటు పడ్డాడు. సులువుగా, అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రక్తబంధం గ్రూప్ ఆర్గనైజేషన్ ట్రస్ట్ అనే వాట్సాప్ గ్రూపులో చేరాడు. ఆ గ్రూప్‌లో ఎవరికైనా రక్తం అవసరముంటే ఆ సెల్‌నెంబర్‌కు ఫోన్ చేసి తాను ఆరోగ్యశ్రీ డిపార్ట్‌మెంట్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెబుతాడు. ఉచితంగా ట్రీట్‌మెంట్ కావాలంటే మీరు కొంత డబ్బు చెల్లించాలని చెప్పి వారి నుంచి ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా డబ్బు వేయించుకుంటాడు. తర్వాత ఫోన్ స్విచ్చాఫ్ చేస్తాడు. ఈ క్రమంలో ఈనెల 13న అనంతపురం ప్రభుత్వాసుపత్రి ఆర్థోవార్డు, గైనిక్ వార్డులోని ఐదుగురు రోగుల బంధువులకు ఫోన్ చేసి, వారి నుంచి రూ.12వేలు వేయించుకుని మోసం చేశాడు. దీనిపై ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారించిన పోలీసులు సాకే శివయ్యను అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో అతను గత ఏడాది డిసెంబరు నుంచి ఇప్పటివరకు 12మందిని మోసం చేశాడు. రూ.30వేల వరకు మోసం చేశాడు. ఎవరైనా ఇలా మోసం చేసినట్లు తెలిస్తే నమ్మకుండా సైబర్ క్రైం ఫ్రీ నెంబర్ 1930కు లేదా డయల్ 100కు ఫోన్ చేయడంతో పాటు స్థానిక పోలీసులను సంప్రదించాలని సీఐ శ్రీకాంత్ కోరారు.

నేడు డీఎంఏ రాక..?

అనంతపురం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(డీఎంఏ) హరి నారాయణ ఆదివారం నగరపాలికకు రానున్నట్లు తెలిసింది. నగరంలోని ప్యాచ్‌వర్క్‌లను ఆయన పరిశీలించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం కడప జిల్లాలో ఉన్న డీఎంఏ ఆదివారం రావచ్చని లేదా మరో మున్సిపాలిటీని సందర్శించే అవకాశం ఉందని తెలిసింది.



శింగనమల చెరువు

టీడీపీ హయాంలో మరువ లైనింగ్ పనులు చేసిన దృశ్యం

అభివృద్ధికి అడుగులు..

ప్రపంచ బ్యాంకు నిధులతో శింగనమల చెరువు అభివృద్ధి

- తూముల మరమ్మతులు, షట్టర్ల ఏర్పాటుకు చర్యలు
- అన్నదాతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయిన శింగనమల శ్రీరంగరాయచెరువు రూపురేఖలు మార్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. చెరువు తూములు, ఆయకట్టు కాలువలను ప్రపంచ బ్యాంకు నిధులతో అభివృద్ధి, మరమ్మతులు చేసేందుకు సమాయత్తమవుతోంది. గత టీడీపీ పాలనలో ప్రపంచ బ్యాంకు నిధులతో ఆయకట్టు కాలువలు, కొన్ని తూములు మరమ్మతులు చేశారు. తూములు ఎత్తే పద్ధతికి స్వస్తి పలికి షెట్టర్లు ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించారు. అయితే చెరువులోనికి నీరు రావడంతో ఆ పనులు పూర్తి కాలేదు. తరువాత అధికారంలోని వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నిధులను వాడుకోలేదు. ఐదేళ్ల పాలనలో చెరువు మరమ్మతులు, ఆయకట్టు కాలువలపై దృష్టి సారించలేదు. ప్రస్తుతం కూటమి పార్టీలు అధికారంలో ఉండటంతో చెరువు అభివృద్ధి పనులపై ఆశలు చిగురిస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి, శింగనమల


5వేల ఎకరాల్లో సాగు



తూములపై ఏర్పాటు చేసిన చెక్కలు, ఇసుప రాడ్లు

శింగనమల శ్రీరంగరాయ చెరువు కింద 5వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. ఈ చెరువు కింద అధికారికంగా 2800 ఎకరాల ఆయకట్టు ఉంది. శింగనమల, గోవిందురాయునిపేట, శివపురం, సి.బండమీదపల్లి, చక్రాయపేట, పోతు రాజుకాల్వ, పెరవలి, సోదనపల్లి, జూలాకాల్వ పరిధిలో మరో 2500 ఎకరాల్లో చెరువులో నీరు ఉంటే పంటలు పండిస్తారు. చెరువు నిండితే 40కి పైగా గ్రామాల్లోని బోర్లలో నీరు పుష్కలంగా లభిస్తుంది. 200కి పైగా మత్స్యకారుల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

పాతకాలం పద్ధతిలోనే...



పాతకాలం నాటి నీరు ఎత్తే తూములు

చెరువుకు పాత కాలం నాటి నాలుగు తూములు ఉన్నాయి. వీటి ద్వారానే ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తా రు. నీరు విడుదల కావాలంటే తూములపై ఏర్పాటు చేసిన ఇసుప రాడ్‌లు పైకి లేపాలి. అప్పుడే నీరు బయటికి పోతుంది. ఇసుపరాడ్‌లు ఎత్తే సమయంలో రాడ్‌కు ఉన్న మొద్దు జారిపోతే నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. అప్పుడు చెరువు కాలువలో 10 అడుగుల లోతుకు వెళ్లి ఆ మొద్దును తగిలించాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం అంతటి గజ ఈతగాళ్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అందుకే కాలువలకు షట్టర్లు ఏర్పాటు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న పతిమల తూము లోపలి భాగం

ప్రపంచ బ్యాంకు నుంచి రూ.4.5 కోట్లు మంజూరు

చెరువు అభివృద్ధి కోసం 2018-2019లో ప్రపంచ బ్యాంకు నుంచి రూ.4.5 కోట్లు నిధులు మజురయ్యాయి. వాటితో చెరువులో నాలుగు తూములకు గ్యాంగ్‌వేర్ నిర్మించి, షట్టర్ల ఏర్పాటుకు చెరువు కట్టపై 3 మీటర్లు వెడల్పుతో మట్టి వేయించడం, చెరువు మరువపై మరమ్మతులు చేయడం, కాలువ మరమ్మతులు చేయడానికి ప్రతిపాదించారు. సుమారు రూ.3.70 కోట్లు ఖర్చు చేసి మరువపై లైనింగ్ పనులు, కాలువల మరమ్మతులు, చెరువుపై మట్టి పనులు చేశారు. అయితే తూముల వద్ద గ్యాంగ్‌వేర్, షట్టర్ ఏర్పాటు చేస్తున్న సమయంలో చెరువులోకి నీరు రావడంతో పనులు ఆగిపోయాయి. ఆగిపోయిన చెరువు గ్యాంగ్‌వేర్, షట్టర్ల ఏర్పాటు గురించి వైసీపీ ప్రభుత్వం అస్సలు పట్టించు కోలేదు. ఐదేళ్ల పాలనలో తమ సమస్యలు పట్టించుకోలేదని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ప్రపంచబ్యాంకు నిధులపై స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణి, నూతన ఆయకట్టు కమిటీ సభ్యులు దృష్టి సారించారు.

రైతులకు మేలు చేయడానికే...



గత టీడీపీ పాలనలో రైతులకు మేలు చేయడానికి సంకల్పించాం. అందుకే చెరువు అభివృద్ధి, మరమ్మతుల కోసం ప్రపంచబ్యాంకు నుంచి రూ.4.50 కోట్లు మంజూరు చేయించాం. ఆ నిధులతో చెరువు చుట్టూ వాల్ నిర్మాణం, ఇతర అవసరమైన పనులు చేశాం. అయితే చెరువులో నీరు చేరడంతో షట్టర్లు అమర్చలేక పోయాం. రైతులకు చెరువు అభివృద్ధికి టిడిపి పార్టీ ముందు ఉంటుంది.

- నెట్టికంటి, ఆయకట్టు మాజీ ఉపాధ్యక్షుడు

కాలువ మరమ్మతులు చేయించాలి



ఐదేళ్ల కిందట కాలువలు మరమ్మతులు చేశారు. అప్పటి నుంచి కాలువల్లో ఎలాంటి పనులు చేయలేదు. కాలువలు అక్కడక్కడ ధ్వంసం కావడంతో చివరి భూముల వరకు నీరు చేరడం లేదు. అధికారులు, నాయకులు స్పందించి కాలువలు మరమ్మతులు చేయాలి.

- గుర్రప్ప, రైతు

షట్టర్లు ఏర్పాటు చేయిస్తాం



గత టీడీపీ పాలనలో చెరువు మరమ్మతులకు ప్రపంచ బ్యాం కు ప్రత్యేకంగా రూ.4.5 కోట్లు విడుదల చేసింది. అందులో రూ.3. 70 కోట్లు వివిధ పనుల కోసం ఖర్చు చేశారు. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో మిగిలిన నిధుల గురించి పట్టించుకోలేదు. నేను ఆయకట్టు అధ్యక్షుడు అయ్యాక ఈనిధులపై ఆరా తీశాం. మిగిలిన నిధులతో చెరువు తూముల మరమ్మతులు, నూతన షట్టర్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తాం.

- సత్యనారాయణ, శింగనమల ఆయకట్టు అధ్యక్షుడు

అభివృద్ధికి కృషి చేస్తా



శ్రీరంగరాయ చెరువు ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తా. మిగిలిన ప్రపంచ బ్యాంకు నిధులతో పాటు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకు వచ్చి అభివృద్ధి పనులు చేపడతాం. చెరువులో నాలుగు తూములకు నూతన గ్యాంగ్‌వేర్‌తోపాటు షట్టర్లు, కాలువల మరమ్మతులకు నిధుల గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతా. చెరువు ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతా.

- బండారు శ్రావణి, ఎమ్మెల్యే

నీరు తగ్గాక షట్టర్ల ఏర్పాటు

శింగనమల చెరువులో తూములు మరమ్మతులు, తూముల వద్ద నూతన షట్టర్లు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతం చెరువులో నీరు ఉండటంతో ఈ పనులు చేయడానికి వీలులేకుండా పోతోంది. అందుకే చెరువులో నీరు పూర్తిగా తగ్గిపోతే పనులు ప్రారంభిస్తాం.

- రాజ్‌కుమార్, ఇరిగేషన్ డీఈ

నగరంలో త్వరలోనే మార్పు: ఎమ్మెల్యే



చెత్త ఊడుస్తున్న ఎమ్మెల్యే, అసిస్టెంట్ కలెక్టర్, డిప్యూటీ మేయర్

అనంతపురం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నగరంలో పరిశుభ్రత విషయంలో త్వరలోనే మార్పు చూస్తారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. శనివారం నగరపాలిక ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నగరంలోని పాతూరులో నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, కమిషనర్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, అధికారులు, నాయకులు హాజరయ్యారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమం ప్రారంభించారు. స్వచ్ఛతపై ప్రజలు, సచివాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రోడ్లు ఊడ్చి, చెత్తను ఎత్తి ట్రాక్టర్లలో వేశారు. అయితే స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం పాతూరులో షోను తలపించింది. వాస్తవానికి అపరిశుభ్రత ఎక్కువగా ఉన్న కాలనీల్లో కాకుండా పాతూరులోని తాడిపత్రి బస్టాండ్ రోడ్డులోని ప్రధాన రహదారిలో చేపట్టారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చీపుర్లు పట్టుకుంటే ఊడ్చడానికి అక్కడ చెత్తలేకపోవడం గమనార్హం. అదేదో కీలకమైన ప్రజాప్రతినిధులు, అధికారులకే సంబంధమున్నట్లు, వారు చేస్తుంటే వీరు చూస్తుండిపోవడంపై పలు విమర్శలు వినిపించాయి.

ఇళ్ల నుంచే స్వచ్ఛత మొదలవ్వాలి

● ఎమ్మెల్యే పరిటాల సునీత



పారిశుధ్య కార్మికులతో కలిసి చెత్తను ఊడుస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యానికి అనుగుణంగా స్వచ్ఛాంధ్రప్రదేశ్‌ను చూడాలంటే మన ఇళ్లు, మన వీధుల నుంచే పరిశుభ్రత ప్రారంభం కావాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. శనివారం రామగిరిలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆమె అధికారుల తో కలిసి పాల్గొన్నారు. ముందుగా అందరితో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఆమె స్వయంగా చీపురు పట్టి చెత్తను ఊడ్చుతూ పారిశుధ్యకార్మికుల్లో ఉత్సాహాన్నినింపారు. ఎత్తను తరలించే వాహనాన్ని తోలారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీచేశారు. ప్రతినెలా మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.

పరిశుభ్రతతోనే అభివృద్ధి: శ్రావణి



శింగనమలలో అధికారులతో కలిసి చెత్తను ఊడుస్తున్న ఎమ్మెల్యే

శింగనమల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన వాతవరణం గ్రామాల అభివృద్ధికి తోడ్పడుతుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. నియోజకవర్గం కేంద్రమైన శింగనమలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో కలసి చీపురుపట్టి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతంలో చెత్తను ఊడ్చారు. తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, ఎంపీడీఓ, నిర్మలా కుమారి, ఈఓపీఆర్‌డీ, వెంకటలక్ష్మి, ఇతర అధికారులు, టీడీపీ నాయకులు దేగల కృష్ణ మూర్తి మూరుతినాయుడు, మాసూలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

వీధి, గ్రామ పరిశుభ్రత మనందరి బాధ్యతని పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. మండలంలోని పాపంపేట, కక్కలపల్లి కాలనీల్లో శనివారం ఎంపడీఓ దివాకర్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే గార్లదిన్నెలో ఎంపీడీఓ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో నార్పల మండల పరిధిలోని బీ పప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి వై మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో, బొందలవాడ గ్రామంలో ఉప సర్పంచు ఆలం వెంకటనరసనాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే రాప్తాడులో ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచ్ సాకే తిరుపాలు తదితరులు, ఆత్మకూరులో ఎంపీడీఓ లక్ష్మీనరసంహ, టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు నారాయణస్వామి, శశాంక చౌదరి తదితరులు పాల్గొన్నారు. చెన్నేకొత్తపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకరప్ప, ఈఓఆర్‌డీ అశోక్‌నాయక్, కనగానపల్లిలో ఎంపీడీఓ అనిల్‌కుమార్, సర్పంచ్ అంకేరామక్రిష్ణ, ఎంపీటీసీ బిల్లే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుభద్రతా వారోత్సవాలపై అవగాహన

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): యువతలో అవగాహన, చైతన్యంతోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని జిల్లా రవాణాశాఖ అధికారి వీర్రాజు పేర్కొన్నారు. స్థానిక నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో శనివారం రోడ్డుభద్రతా వారోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రవాణాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ సీఐ రఘుప్రసాద్, నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను పక్కాగా నిర్వహించండి

● కలెక్టర్ వినోద్‌కుమార్ ● పోస్టర్ల విడుదల



పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టరు తదితరులు

అనంతపురం టౌన్, జనవరి18(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పశు ఆరోగ్య శిబిరాలను ఈ నెల 20వ తేదీ నుంచి 31 వరకు పక్కాగా నిర్వహించాలని అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ... రాష్ట్రప్రభుత్వం పశుసంపదకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందదన్నారు. పశువుల ఆరోగ్యం, ఉత్పాదకత పెంచడం, పశుపోషణ ఖర్చులు తగ్గించడం తదితర విషయాలపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగానే పశు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలను పక్కా ప్రణాళికతో నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, పశు సంవర్ధకశాఖ జేడీ వెంకటస్వామి, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, ఎల్డీయం నర్సింగరావు, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, నాబార్డు డీడీఎం అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

కాపులకు లక్ష్యం మేరకు రుణాలివ్వాలి

కాపు యాక్షన్ ప్లాన్ పరిధిలో కాపులకు స్వయం ఉపాధిపథకం కింద బ్యాంకులకు కేటాయించిన రుణాలను మంజూరుచేయాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ కాపు యాక్షన్ ప్లాన్ 2024-25 కింద ఓబీఎంఎంఎస్ స్వయం ఉపాధి కింద జిల్లాకు 344యూనిట్లకు గాను రూ. 11.55 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందేలా చూడాలని ఆయన సూచించారు.

క్యాజువాలిటీ వార్డు పునర్నిర్మాణానికి నిధులివ్వండి

● బీపీసీఎల్ సీఎండీని కోరిన ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని క్యాజువాలిటీ వార్డు పునర్నిర్మాణం కోసం నిధులు ఇవ్వాలని బీపీసీఎల్ సీఎండీని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు శనివారం ముంబైలో బీపీసీఎల్ సీఎండీకి ఎంపీ అంబికా వినతి పత్రం అందజేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ పేర్కొన్నారు. అలాగే హెచ్‌పీసీఎల్, ఓఎన్‌జీసీ సంస్థలు వాటర్‌ప్లాంట్లు నిర్మాణం కోసం నిధులు సమకూర్చేందుకు అంగీకరించినట్లు ఎంపీ తెలిపారు.

ఇంకా వైసీపీ గాలే సోకుతుందా..?

● అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

శింగనమల, జనవరి18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చిన్న సమస్యలు తెలిపినా అధికారులు సందించరా.... మీకు ఇంకా వైసీపీ గాలే సోకుతోందా...? అంటూ మండల అధికారులపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో అపరిశుభ్రతను సక్రమంగా తొలగిచడం లేదని, శింగనమలలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి శనివారం వచ్చిన ఎమ్మెల్యేకి స్థానికులు ఫిర్యాదు చేశారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ కార్యాలయంలో పనులు కోసం వెళితే...అధికారులు స్పందిచడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దానితో ఎమ్మెల్యే పై విధంగా స్పందించారు.

ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు దరఖాస్తులు నిల్

అనంతపురం అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. రెండో సారి పొడిగించిన శనివారం సాయంత్రం 5 గంటలతో గడువు ముగిసింది. అయినా ఒక దరఖాస్తు కూడా దాఖలు కాకపోవడం గమనార్హం. దరఖాస్తు రుసుం నాన్‌రిఫండబుల్ రూ.15 లక్షలతో పాటు వార్షిక పన్ను తొలి సంవత్సరం ఏకంగా రూ.కోటి నిర్ణయించడమే దరఖాస్తులు దాఖలు కాకపోవడానికి కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి.

డంపింగ్ యార్డు తరలింపునకు స్థలం ఇవ్వండి

● జేసీకి ఎమ్మెల్యే దగ్గుపాటి వినతి

అనంతపురం అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డును తరలించేందుకు నగర సమీపంలో అనువైన స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ జేసీ శివనారాయణశర్మను కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో జేసీకి ఎమ్మెల్యే దగ్గుపాటి వినతి పత్రం అందజేశారు. డంపింగ్ యార్డులో రోజు రోజుకు చెత్త పెరిగిపోతుండటంతో చుట్టు పక్కల కాలనీల వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డంపింగ్ యార్డు సమస్యకు సరైన పరిష్కారం ఇక్కడి నుంచి తరలించడమేనని ఎమ్మెల్యే వివరించారు. అలాగే అర్బన్‌కు సంబంధించి పలు అంశాలను జేసీతో చర్చించారు.

బోర్డులో కొత్త అధికారి పేరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పాత అధికారి పేరు స్థానంలో కొత్త అధికారి పేరు ఏర్పాటు చేశారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అధికారి మారినా....పేరు మారదా అనే కథనానికి జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారులు స్పందించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్‌డీఓ) అధికారి షఫీ ఈనెల నవంబరు 14వ తేదీన వివిధ ఆరోపణలు, అక్రమాల నేపథ్యంలో సస్పెన్షన్ వేటు పడింది. అయితే ఆ స్థానంలో శ్రీసత్యసాయి డీఎస్‌డీఓగా ఉన్న ఉదయ్‌భాస్కర్‌ను ఇక్కడ నియమించారు. అయితే అశోక్‌నగర్ డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో కార్యాలయంలో సమాచార హక్కు చట్టం, ఉద్యోగులు, కోచ్‌ల వివరాలు తెలిపే బోర్డుల్లో కూడా పాత అధికారి పేరును అలాగే ఉంచారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో స్పందించి పాత అధికారి పేరు స్థానంలో నూతన డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ పేరును ఏర్పాటు చేశారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవం



గాత్రనీరాజనం చేస్తున్న సంగీత కళాకారులు

అనంతపురం కల్చరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): త్యాగరాజ స్వామి 178వ ఆరాధనోత్సవాన్ని శనివారం సాయంత్రం మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాణి సంగీత కళానిలయం ఆధ్వర్యంలో తొలుత త్యాగరాజస్వామి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని వేదికపై చెన్నైకి చెందిన మధుమతి, సుమేధల బృందం నిర్వహించిన కర్ణాటక శాస్త్రీయ సంగీత వీనులవిందు చేసిది. త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తూ త్యాగరాజస్వామికి గాత్రనీరాజనం పలికారు. విజయవాణి సంగీత కళానిలయం నిర్వాహకుడు మొదలి మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్ పాలసముద్రం నాగరాజు, సంగీత కళాకారులు దివ్య, శ్రీనిధి కౌండిల్య పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో జీవించండి

● అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ బాధితులు అధైర్యపడి కుంగి పోకుండా, ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా జీవించాలని హెచ్‌ఐవీ బాధిత విద్యార్థులకు అసిస్టెంట్ కలెక్టరు బొల్లినేని వినూత్న సూచించారు. అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఐఎంఏహాల్‌లో 8,9,10 తరగతులు చదువుతున్న హెచ్‌ఐవీ బాధిత విద్యార్థులకు గైడ్లు, పరీక్షల సామగ్రి, పౌష్టికాహారం సంపిణీచేశారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న ముఖ్యఅతిథిగా హాజరై ఆ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వనజాఅక్కమ్మ, ఐఎంఏ కార్యదర్శి డాక్టరు నిరంజన్‌రెడ్డి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డీపీఎం భాస్కర్, అనంత నెట్‌వర్క్ సంస్థ నాయకులు వీరాంజినేయులు, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛ ఆంధ్ర

అనంతపురం అర్బన్ / విద్య/ టౌన్/ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం, పశుసంవర్థక శాఖ జేడీ కార్యాలయం, ఉద్యాన శాఖ, ఏపీఎంఐపీ, అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆఫీస్, అనంతపురం ఆర్టీఏ కార్యాలయ ఆవరణల్లో ఆ యా శాఖల ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అధికారులు ముందుకు కదిలారు. మొదట జిల్లావిద్యాశాఖాధికారి ప్రసాద్ బాబు, ఏడీ క్రిష్ణయ్య, ఇతర సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. తర్వాత అధికారులు చీపుర్లు చేతబట్టి విద్యాశాఖ పరిసరాలను శుభ్రపరిచారు. జిలా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీదేవి, ఇతర డాక్టర్లు, వైద్యఉద్యోగులు పరక, పార పట్టి ఆవరణంలో ఉన్న చెత్తచెదారంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించారు. జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ శాఖ ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఇతర అధికారులు, ఉద్యోగులు కార్యాలయం ఆవరణంలో చెత్త ఊడ్చి ఎత్తి పడివేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో టెక్నికల్ ఈఈ ప్రసాద్, ట్రాన్స్‌ఫార్మర్ ఈఈ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణ సమయంలో జాగ్రత్త అవసరం

● న్యాయాధికారి సత్యవాణి

అనంతపురం క్రైం, జనవరి18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరికీ జాగ్రత్త అవసరమని మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి సత్య వాణి అన్నారు. శనివారం కెనరాబ్యాంకు సహకారంతో బ్యాంకు గుర్తించిన లబ్ధిదారులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా హెల్మెట్లను అందజేశారు. కార్యక్రమంలో న్యాయాధికాణి సత్యవాణి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ హాజరై మాట్లాడారు. జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి, ట్రాఫిక్ సీఐ రఘుప్రసాద్, బ్యాంకు మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

నైట్ షెల్టర్‌ను సందర్శించిన డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ నగరంలోని కమలానగర్‌లోని నైట్ షెల్టర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్న మహిళలతో మాట్లాడారు. వారి కనీస అవసరాలు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. సీనియర్ సిటిజన్ ఆక్ట్-2007 గురించి వారికి తెలియజేశారు. పింఛన్, రేషన్, ఆధార్ కార్డుల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు.

‘మా వాటా మాకు ఇవ్వాల్సిందే’

అనంతపురం సెంట్రల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సమాజంలో అత్యధిక శాతం జనాభా ఉన్న బీసీలకు ప్రభుత్వంలో తగిన వాటా ఇవ్వాల్సిందేనని బీఎస్పీ బీసీ సమన్వయ కమిటీ నాయకులు డిమాండ్‌చేశారు. బీఎస్పీ బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శనివా రం జిల్లా కేంద్రంలో మహాధర్నాను నిర్వహించారు. సమన్వయ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీరాములు అధ్యక్షతన వహించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి, కో-ఆర్డినేటర్ పూర్ణచంద్ర రావు, సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రమణ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించి అనంతరం మహాధర్నాలో మాట్లాడారు. దేశంలో సమగ్ర కులగణనచేసి జనాభా ప్రకారం ఆర్థిక, రాజకీయ, సామాజిక వాటాలివ్వాలని 1931లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం తీర్మాణం చేసిందన్నారు. అయితే నేటికీ ఆ దిశగా బీసీలకు వాటాలు దక్కడంలేని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పుడున్న అసమానతలు పోయి సమాన వాటాలు దక్కాలంటే సమగ్ర కులగణన చేయాలని డిమాండ్ చేశారు. ఈ పోరాటం దేశవ్యాప్తంగా కొగసాగుతుం దన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సి.నాగరాజు, హంపావతి గోవిందు, జిల్లా అధ్యక్షులు నాగభూషణం, కె.నాగరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు అడ్వకేట్ హరిప్రసాద్, కుళ్లాయప్ప, జిలాన్ బాష, సుబ్బరాయుడు, ఇందీవర్, ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్య క్షుడు డాక్టర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించండి

అనంతపురం అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌కు అనంతపురం అర్బన్ ఈడిగ, గౌడ, శెట్టి బలిజ సంఘం నాయకులు కోరారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆ సంఘం నగర అధ్యక్షుడు గోపాల్ గౌడ్, రూరల్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేశారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



అనంతపురం ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న పార్టీ జిల్లా నాయకులు, తెలుగు మహిళలు



టీడీపీ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి, ఇతర నాయకులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని టీడీపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.



వైకుంఠం ప్రభాకర్ చౌదరి క్యాంప్ ఆఫీస్‌లో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న దేవళ్ల మురళి, బంగి నాగ, విజయశ్రీరెడ్డి తదితరులు



నివాళులు అర్పిస్తున్న టీడీపీ కుమ్మర శాలి వాహన విభాగం రాష్ట్ర కన్వీనర్ పోతలయ్య



వడ్డెర్ల సంఘం కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఆ సంఘం నాయకులు కుంచెపు వెంకటేష్, సిమెంట్ పోలన్న



జిల్లా గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న గౌస్‌మొయిద్దీన్ తదితరులు



జడ్పీ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రూరల్‌నాయకులు



గార్లదిన్నెలో నివాళులర్పిస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి, నాయకులు

21న మండల సమావేశం

నార్పల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 21వ తేదీన సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తు న్నట్లు గంగావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావా లన్నారు. సమావేశంలో వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, తాగునీరు, ఉపాధి హామీ పనులతో పాటు పలు పనులపై చర్చించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఎన్టీఆర్‌కు నివాళి

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)



కురుగుంట అంధుల ఆశ్రమంలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



టీడీపీ సిండికేట్‌నగర్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు



ఆత్మకూరులో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



చెన్నేకొత్తపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు



కనగానపల్లిలో....


బ్రహ్మసముద్రంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ శ్రేణుల నివాళి..


విడపనకల్లులో చిత్రపటం వద్ద..


రాయదుర్గంలో రక్తదానం చేస్తున్న సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి

చిరస్మరణీయుడు ఎన్టీఆర్

● వర్ధంతి సభలో వక్తలు ● వాడ వాడలా ఘన నివాళి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. ఆయన 29వ వర్ధంతి సభలను శనివారం గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో వాడవాడలా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నందమూరి అభిమానులు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ... ఎన్టీఆర్ కారణజన్ముడని, సినీ, రాజకీయ రంగాల్లో తిరుగు లేని కీర్తిని గడించారని కొనియాడారు. తెలుగు వారి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగు ప్రజలకు అనేక సేవలందించారని గుర్తు చేశారు. ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేయారని చెప్పారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వర్ధంతి సందర్భంగా పలు చోట్ల రక్తదాన శిబిరాలను, అన్నదాలను నిర్వహించారు. పలు ఆస్పత్రులలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు.


కూడేరులో ఎన్టీఆర్ వర్ధంతిలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు


గుత్తిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకుల నివాళి


ఉరవకొండలో ..


గుమ్మఘట్ట మండలం టీడీపీలో ..


బెళుగుప్పలో..


పామిడిలో..


పెద్దవడుగూరులో..

యాడికిలో ..


భూగర్భ జలాల పెంపునకు కృషి: కలెక్టర్

ఉరవకొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వర్షపునీరు వృథా కాకుండా భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మండలంలోని లత్తవరంలో శనివారం ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, వ్యక్తిగత ఇంకుడు గుంతలను ప్రారంభించారు. అలాగే కమ్యూనిటీ నీటి గుంతలు, వ్యక్తిగత నీటి గుంతల నిర్మాణానికి భూమి పూజ చేశారు.

అనంతరం గ్రామ సచివాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వర్షపు నీరు వృథా కాకుండా భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అనంతరం వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, జడ్పీసీఈవో రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ సలీం బాషా, డీపీఓ నాగరాజు, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ రవిప్రసాద్, సీడీపీఓ శ్రీదేవి, ఏపీఓ విమల, మాజీ సర్పంచ్ గోవిందు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న కలెక్టర్

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు భరోసానిచ్చారు. రోడ్డు ప్రమాదంలో శెట్టూరు మండలంలోని లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన యువకులు ఫరూక్, నాసిర్ మృతి చెందారు. దీంతో ఎమ్మెల్యే అమిలినేని శనివారం కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్దకు కూటమినాయకులతో కలిసి మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం అక్కడే ఉన్న డీఎస్పీ రవిబాబుతో ప్రమాద సంఘటన గురించి తెలుసుకున్నారు.

దళారులను నమ్మి మోసపోకండి..

గాలిమరల పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని, రైతులు భూములు కొనేందుకు వస్తున్న దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే అమిలినేని సూచించారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద గూళ్యం గ్రామానికి చెందిన కొంతమంది రైతులు వచ్చి ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. తక్కువ ధరకు మా భూములు అగ్రిమెంట్, రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కొంతమంది దళారులు వచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గాలిమరల పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కొన్ని నిబంధనలు తెచ్చిందని, కానీ మధ్యలో మధ్యవర్తుల మాట విని రైతులు మోసపోయి భూములు ఇవ్వరాదని అన్నారు. ఆర్డీవోతో చర్చించి దళారుల మోసాలను అరికడతామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు రైతులు వినతిపత్రం అందించారు.

శెట్టూరులో పర్యటన ..

శెట్టూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ వర్ధంతి సభలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బీఆర్ అంబేద్కర్, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహాలకు కూడా పూలమాలలు వేశారు. అనంతరం కాలనీ వాసులకు తన సొంత నిధులతో దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీలో సీసీ రోడ్లు, బసంపల్లి గ్రామంలో వాటర్ ప్లాంట్, మండల కేంద్రం నుంచి అన్ని గ్రామాలకు తారురోడ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రారంభమైన దేవర

యల్లనూరు/పుట్లూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): యల్లనూరు మండలకేంద్రంతో పాటు పుట్లూరు మండలం కడవకల్లు గ్రామంలో శనివారం పెద్దమ్మ దేవర వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సాయంత్రం స్థానిక అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్ధరాత్రి సమయంలో జ్యోతుల కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించనున్నట్లు గ్రామాల పెద్దలు తెలిపారు.

మరోసారి చిరుత హల్‌చల్

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామంలో చిరుత మరోసారి హల్‌చల్ చేసింది. శనివారం తెల్లవారుజామున సంచరించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తమ గ్రామానికి పక్కనే ఉన్న కొండల్లో చిరుత తిష్ట వేసిందని, అందువల్ల అది ఎప్పుడు వస్తుందోనని బిక్కుబిక్కుమంటూ జీవించాల్సి వస్తోందని పలువురు వాపోయారు. అటవీ అధికారులకు సమాచారం ఇవ్వగా.. నామమాత్రంగా గస్తీ నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా గస్తీ ముమ్మరం చేసి చిరుత భయాన్ని తొలగించాలని వారు కోరారు.

కేబుల్ చోరీ

యాడికి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో పరిమి చరణ్ అనే రైతుకు చెందిన తోటలో శుక్రవారం రాత్రి దొంగలు పడి బోరు మోటార్లకున్న కేబుల్ వైరు కత్తిరించుకువెళ్లారు. తోటవద్దకు శుక్రవారం సాయంత్రం వెళ్లి వచ్చానని, మళ్లీ శనివారం ఉదయం వెళ్లి చూడగా తోటలోని మూడు వ్యవసాయ బోరుబావులకు సంబంధించిన కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించుకువెళ్లారని బాధితుడు తెలిపారు. సుమారు 80మీటర్ల కేబుల్‌ను కత్తిరించినట్లు చెప్పారు. ఇటీవల వ్యవసాయ బోరుబావుల వద్ద కేబుల్ చోరీలు ఎక్కువయ్యాయని అన్నారు. పోలీసులు తగు చర్యలు చేపట్టి వీటికి అడ్డుకట్ట వేయాలని కోరారు.

గొర్రెల పెంపకం దారుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

బెళుగుప్ప, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దేకుంటలో ఆంజనేయస్వామి గొర్రెలు పెంపకందారుల సంఘం ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగినట్లు పశువైద్యాధికారి రమేష్‌బాబు తెలిపారు. ఎన్నికల అధికారి డాక్టర్ మంజునాథ్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా రమేష్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మన్నను ఎన్నుకున్నారన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం ఆర్టీవో రమేష్‌బాబు వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఆరుగురిని గుర్తించి కేసు నమోదు చేశారు. ఎవరైనా మద్యంతాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూరల్ సీఐ వంశీకృష్ణ, ఎంవీఐ మనోహర్ రెడ్డి, ఏఎంవీఐ లహరి పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

పెద్దవడుగూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రచేడు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి నాగేంద్ర అనే రైతుకు చెందిన గడ్డివాముకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో దగ్ధమైంది. దీంతో రూ.40వేల మేర నష్టం చేకూరింది. గ్రామంలో ఎలాంటి వ్యక్తిగత కక్షలు లేవని, గుర్తుతెలియని వ్యక్తులు చేపట్టిన చర్యల వల్ల ఆర్థికంగా నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

కణేకల్లు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఓ బేకరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులోని కేకులను కాటాలో తూకం వేయగా.. రెండు కేజీలకు గాను 519 గ్రాములు తక్కువగా ఉండటాన్ని గమనించారు. దీంతో ఆ బేకరీ యజమానికి రూ. 15 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణ యజమానుదారులు వినియోగదారులకు తూకాలలో మోసాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

శెట్టూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెర్లోపల్లి గ్రామం వద్ద కుందుర్పి, కళ్యాణదుర్గం ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. చెర్లోపల్లి గ్రామానికి చెందిన గొల్ల బాలప్ప (65)ను కారు ఢీకొంది. దీంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాంభూపాల్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాద కారణాలను స్థానికుల ద్వారా ఆరా తీసి కేసు నమోదు చేస్తామని అన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

పామిడి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాదర్‌పేట గ్రామంలో నివాసం ఉంటున్న పుల్లయ్య(45) శనివారం అనుమానస్పదస్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో పుల్లయ్య వ్యవసాయం, మగ్గంతో జీవనం సాగించేవాడు. గత కొంతకాలంగా ఇంట్లో కుటుంబ కలహాలు తలెత్తాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది భార్య కళావతి నిద్రించిన తర్వాత పురుగుల మందు తాగి ఇంటి బయట నిద్రించాడు. ఉదయం లేచి చూస్తే మృతి చెందినట్లు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించామని, కాగా మృతదేహంపై చిన్నపాటి గాయాలు ఉండడంతో అనుమానం తలెత్తిందని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారన్నారు. మృతుని సోదరుడు నారాయణస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడు..

బెళుగుప్ప, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన యువకుడు షేక్ లాలుసాబ్ (32) చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ రామదాసు తెలిపారు. ఆటో నడుపుతూ జీవనం సాగించే షేక్ లాలూ సాబ్ వ్యసనాలకు బానిసై రూ. మూడు లక్షలకు పైగా అప్పులు చేశాడు. కంతులు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ వారు ఆటో కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో మనస్థాపానికి గురై ఈ నెల 16వ తేదీన క్రిమి సంహారక మందు తాగాడు. అపస్మారక స్థితిలో వుండగా కుటుంబ సభ్యులు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య షేక్ బీబీ, ఒక కుమార్తె వున్నారు. భార్యఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత?

పుట్లూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మడ్డిపల్లిలో శనివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. తాడిమర్రికి చెందిన ఓ వ్యక్తి రేషన్ బియ్యం తరలిస్తుండడంతో పోలీసులు దాడులు నిర్వహించి ఆరు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు

బొమ్మనహాళ్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. వేకువజామునే ప్రధాన అర్చకులు అనిల్ కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు, పవన్‌కుమార్ తదితరులు మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో, వెండికవచంతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మహామంగళహారతి ఇచ్చారు. పెద్దఎత్తున భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు.


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు

రాయదుర్గంరూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెనుకబడిన తరగతుల వారి జీవనోపాధి కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం 31 కార్పొరేషన్ యూనిట్లను మంజూరు చేసినట్లు ఎంపీడీఓ కొండన్న శనివారం ప్రకటనలో తెలిపారు. బీసీ- ఏ క్యాటగిరీకింద 18 యూనిట్లు, బీసీ బీకి 9, బీసీ డీకి 5, బీసీఈకి నాలుగు యూనిట్ల చొప్పున మొత్తం 31 యూనిట్లను మంజూరు చేసిందన్నారు. ఏపీజీబీ భూపసముద్రం పరిధిలో ఎనిమిది యూనిట్లు, ఏపీజీబీ రాయదుర్గం పరిధిలో 10 యూనిట్లు, కెనరా బ్యాంకు పరిధిలో 9 యూనిట్లు, ఎస్‌బీఐ పరిధిలో నాలుగు యూనిట్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తొందరలోనే దరఖాస్తుకు చేసుకునేందుకు తేదీలను ప్రభుత్వం ఖరారు చేస్తుందన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పామిడి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మైన్స్ అండ్ జియాలజీ డీడీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఎస్ఐ రవిప్రసాద్ శనివారం పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తుండడంతో ఆ ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ విజయ్, వీఆర్వో నాగప్ప పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ఉరవకొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నవోదయలో ఆరో తరగతి ప్రవేశం కోసం పట్టణంలో నవోదయ విద్యా సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతగా ముగిసింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని సీఎల్‌ఓ షేక్ అసాఫ్ అలీ, హెచ్ఎం ఈరన్న పర్యవేక్షించారు. పరీక్షకు 293 మంది విద్యార్థులకుగాను 216 మంది హాజరయ్యారని, 77 మంది గైర్హాజరయ్యారని వారు తెలిపారు.

ఆలయ భూమిని కాపాడాలని వినతి

కళ్యాణదుర్గం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కంబదూరు మండలం కొత్తూరులో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూమిని కాపాడాలని తహసీల్దార్ బాలకిషన్‌కు గ్రామస్థులు వినతిపత్రం సమర్పించారు. మండలకేంద్రంలో శనివారం వారు తహసీల్దార్ ను కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయానికి సంబంధించి 3.57 ఎకరాల భూమి ఆక్రమణకు గురైందన్నారు. ఆ భూమికి సంబంధించిన వాస్తవాలను బయటపెట్టాలని అన్నారు. గతంలో పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఎవరూ స్పందించలేదని, మీరైనా న్యాయం చేయాలని కోరారు. ఆలయ భూమిని కాపాడుతామని తహసీల్దార్ గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

ఉపాధిపనుల్లో అవినీతి బట్టబయలు

● రూ.1.03లక్షల రికవరీకి అధికారుల ఆదేశం

గుంతకల్లుటౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల్లో ప్రజా వేదిక ద్వారా అవినీతి బట్టబయలు అయింది. రూ.1.03లక్షలు రికవరీకి అధికారులు ఆదేశించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ప్రజావేదికను జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్, సలీంబాషా అధ్యక్షతన నిర్వహించారు. 2023-24వ సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో రూ.12,91,99,983 వ్యయంతో పనులు చేపట్టారు. ఈ పనులపై గత డిసెంబరు 30నుంచి జనవరి11వరకు సామాజిక తనిఖీ బృందం సామాజిక తనిఖీ నిర్వహించారు. అందుకు సంబంధించిన వివరాలను ప్రజా వేదికలో గ్రామ పంచాయతీ వారిగా తయారు చేసిన నివేధికలను ప్రజా వేదికలో తనిఖీ బృందం ప్రవేశపెట్టారు. గ్రామాల్లో ఉపాధి కూలీలు పనులకు రాకున్నా.. హాజరైనట్లు చూపారని బయటపెట్టారు. అలాగే పనుల్లో అవినీతి జరిగిందని గుర్తించారు. ఈ మేరకు రూ.1.03లక్షలు రికవరీ చేయాలని అధికారులు ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. అలాగే విధి నిర్వహణలో ఆలసత్వం వహించిని 25 పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.95వేలు జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి, అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, డీవీఓ రమణారెడ్డి, ఏపీఓ కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతిపై తహసీల్దార్ బదిలీ

విడపనకల్లు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా విదులు నిర్వహిస్తున్న సునీతాబాయి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై కర్నూలుకు బదిలీ అయ్యారు. దీంతో మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఆమెను శనివారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాక్షించారు.. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సునీతాబాయి

పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలి

● స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌లో ఎమ్మెల్యేలు, అధికారుల పిలుపు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలని, పట్టణాలను, గ్రామాలను స్వచ్ఛప్రాంతాలుగా తీర్చుదిద్దుకుందామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. రాయదుర్గం పట్టణంలోని వినాయకసర్కిల్లో శనివారం ఆయన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అందరూ మానవహారంగా ఏర్పడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛ ఆంధ్రకు కృషి చేద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు. తర్వాత ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందుకే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రతివారంలో మూడో శనివారం ఈ కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. పట్టణంలో పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు రోడ్డుకు ఇరువైపులా మున్సిపల్ అధికారులు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, చైర్‌పర్సన్ పొరాళు శిల్ప, కౌన్సిలర్ ప్రశాంతి, మాజీ వైస్ చైర్మన్ నల్లపూల వెంకటేశులు, అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పట్టణాన్ని స్వచ్ఛతగా చేసుకుందామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. స్వచ్ఛఆంధ్ర- స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా గుంతకల్లు పట్టణంలో ఆయన టీడీపీ నాయకులు మున్సిపల్, పంచాయతీ, మెప్మా అధికారులతో పాటు పొదుపు సంఘాల సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పిలుపును అందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పట్టణాలు, గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రం చేసుకుందామని, ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలని కోరారు. అనంతరం ఈ మేరకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, పత్తిహిమబిందు, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, తలారిమస్తానప్ప, గుర్రప్ప, ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్‌తో పాటు బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించి కళ్యాణదుర్గం మున్సిపాలిటీని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుదామంటూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. పట్టణంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళ్యాణదుర్గం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. పరిశుభ్రత పట్టణంగా తీర్చిదిద్దుతామని అన్నారు. మున్సిపల్ అధికారులు, టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో పరిసర ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపట్టారు.

● తాడిపత్రి పట్టణంలో స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ , కౌన్సిలర్లు, అధికారులు, ప్రజలు నిర్వహించారు. అశోక్‌పిల్లర్ సమీపంలో మానవహారంగా ఏర్పడి పరిశుభ్రత కార్యక్రమాల్లో అందరం పాల్గొంటామంటూ ప్రమాణం చేశారు.

అలాగే గుత్తి మున్సిపాలిటీలో కమిషనర్ జబ్బార్‌మియా ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది స్థానిక మార్కెట్ వద్ద పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఇక పామిడి, యాడికి, పెద్దవడుగూరు, బొమ్మనహాళ్, శెట్టూరు మండలకేంద్రాలతో పాటు పుట్లూరు మండ లం ఎల్లుట్ల, పెద్దపప్పూరు మండలం నరసాపురం, బెళుగుప్ప మండలం తగ్గుపర్తి, బ్రహ్మసముద్రం మండలం ఎస్ కోనాపురం గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్ర మాలు జరిగాయి. వాటిల్లో పలు శాఖల మండల, గ్రామ స్థాయి అధి కారులు, సిబ్బంది, ప్రజాప్రనిధులు, కూటమి శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.


రాయదుర్గంలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు


గుంతకల్లులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తదితరుల ప్రతిజ్ఞ



కళ్యాణదుర్గంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని తదితరులు